జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక



టీజీ టీ20 మెగా వేలం
రూ.33 లక్షలకు సొంతం చేసుకున్న మెదక్ ఫాల్కన్స్
8

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 9 ॥ సోమవారం ॥ 8-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



# మల్కాజిగిరి చలవతోనే ఈ స్థాయికి..

హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి, మూసీ నదీ ప్రక్షాళనకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడుగడుగునా అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేద్దామని, కష్టపడి నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు, అనుమతులు తీసుకువస్తే కిషన్ రెడ్డిని ఎల్బీ స్టేడియంలో గండపెండేరంతో సన్మానిస్తానని సీఎం సవాల్ విసిరారు.

**రాష్ట్రానికి నిధులు తెస్తే సన్మానిస్తామంటూ సీఎం రేవంత్ ప్రకటన**

**రూ.1,600 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన**

**హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర మంత్రి అడుగడుగునా అడ్డంకులు**

**పరిపాలన సౌలభ్యం కోసమే నగరంలో మూడు కార్పొరేషన్ల ఏర్పాటు**

**పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధి.. మల్కాజిగిరి చలవతోనే ఈ స్థాయికి**

**ఉప్పల్‌లో కుల సంఘం భవనాల ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

హైదరాబాద్, జూన్ 07: ఉప్పల్ భగాయత్‌లో ఖత్రి భవన్, వంజరి కుల ఆత్మగౌరవ భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం రూ.1,600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి సహకరించకపోగా, అడుగడుగునా మోకాలొడ్డుతున్నారని తరువాయి 2 వ పేజీలో...



## నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ప్లాంట్

**ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని కోరిన మంత్రి లోకేశ్**

**రష్యాలో గిరెడ్మెట్ ప్రతినిధులతో లోకేష్ భేటీ**

మాస్కో (రష్యా), జూన్, 07: రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ పరిశోధన సంస్థ గిరెడ్మెట్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మాస్కోలో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కీలక ఖనిజాల విలువ ఆధారిత పరిశ్రమల అభి వృద్ధి, అధునాతన తరువాయి 2 వ పేజీలో...

## ఏపీ సరికొత్త కుట్ర, రేవంత్ సర్కార్ జల ద్రోహం

**బాబు మెప్పు కోసం గోదావరికి గండి!**

**నదుల అనుసంధానం ముసుగులో కావేరికి జలాల మళ్లింపు**

**రాష్ట్రం నుంచి కాకుండా నేరుగా పోలవరం నుంచి తరలించేలా స్కెచ్**

**తెలంగాణకు దక్కాల్సిన 211 టీఎంసీల వాటాకు శాశ్వతంగా ఎసరు**

**అఖిలపక్షం వేసి, అసెంబ్లీలో తీర్మానం చేయాలని హరీశ్ డిమాండ్**



హైదరాబాద్, జూన్ 07: తెలంగాణ జల హక్కుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గోదావరి-కావేరి -2 వ పేజీలో...

## 'జన్‌బంధన్' వేదికగా విపక్షాల సమావేశం



**హాజరు కానున్న 23 రాజకీయ పార్టీలు**

**ఖరారు చేసిన జైరామ్ రమేశ్**

కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటానికి సిద్ధమవుతున్న ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలోని కన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించబోతోంది. జన్‌బంధన్ పేరుతో జరగనున్న ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా 23 రాజకీయ పార్టీలు హాజరుకానున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరామ్ రమేశ్ అధికారికంగా ప్రకటించారు.

న్యూఢిల్లీ, జూన్ 07:ఇటీవల జరిగిన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, విపక్షాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ జన్‌బంధన్ మీటింగ్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే ఒక ఉమ్మడి జాతీయ కార్యాచరణను సిద్ధం చేయడం కూటమి వ్యూహంగా పొలిటికల్ సర్కిల్స్ భావిస్తున్నా యి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, ఓటు

## ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీల రద్దు

**జనసేనాని సంచలన నిర్ణయం**



అమరావతి, జూన్ 07: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పార్టీ నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడం, పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మద్దతుదారులు, జనసైనికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీని తరువాయి 2 వ పేజీలో...

## నేడు పశ్చిమ గోదావరి జిల్లాలో బాబు పర్యటన

**సిద్ధాంతంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమం**

**రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ చేయనున్న సీఎం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో జరిగే బహిరంగ సభలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి స్వయంగా అందజేస్తారు.

సిద్ధాంతం, జూన్ 07: గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన పాస్‌పుస్తకాల్లోని తప్పులను సరిదిద్ది, రైతుల సమక్షంలోనే రీ-సర్వే చేసి పారదర్శకంగా వీటిని అందిస్తున్నారు. ప్రతీ నెలా సీఎం నేరుగా రైతులతో సమావేశమై, అధికారులతో భూ తరువాయి 2 వ పేజీలో...



# నేటి రాశి ఫలాలు

మేషం: గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. గృహమున కొన్ని సంఘటనలు మానసిక అశాంతి కలిగిస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు కలుగుతాయి. బంధువులతో విభేదాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

వృషభం: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. కొన్ని ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో పూర్తి అవుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

మిథునం: సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సన్నిహితుల నుంచి ధనలాభ సూచనలున్నవి. మిత్రులతో వివాదాల నుండి బయటపడతారు. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. వ్యాపార వ్యవహారాల్లో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకం: గృహమున ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వ్యాపార విస్తరణకు సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది.

సింహం: ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగులకు స్థానచలన సూచనలున్నవి.

కన్య: బంధు మిత్రులతో ఊహించని మాట పట్టింపులుంటాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ప్రయాణాల్లో అవరోధాలు కలుగుతాయి. వ్యాపార విషయంలో తొందరపాటు నిర్ణయాలు నిరాశ పరుస్తాయి. ఉద్యోగులకు పని ఒత్తిడులు పెరుగుతాయి.

తుల: విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. విలువైన వస్తులాభాలు పొందుతారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వాహన అనుకూలత కలుగుతుంది. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృశ్చికం: బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం తప్పదు. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. నిరుద్యోగ ప్రయత్నలలో అవరోధాలు కలుగుతాయి.

ధనస్సు: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన గృహ వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు క్రమం క్రమంగా ఇబ్బందులు తొలగుతాయి.

మకరం: కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు సాదాసీదాగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.

కుంభం: స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. సోదరుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

మీనం: ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆప్తులు సలహాలు కొన్ని విషయాలలో కలసి వస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.



# మల్కాజిగిరి చలవతోనే ఈ స్థాయికి..

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి మండిపడ్డారు. "అన్ని అనుమతులు వచ్చాక మెట్రో విస్తరణను కేంద్ర మంత్రిగా ఉన్న ఆయనే కాళ్లలో కట్టెలు పెట్టి ఆపుతున్నారు. మూసీలో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు,పిల్లలకు చదువు చెబుతామంటే అడ్డుపడుతున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం నేను యాభై సార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిశా. మెట్రోకు అనుమతులు, మూసీకి నిధులు తీసుకువచ్చే బాధ్యత కిషన్ రెడ్డికి లేదా? హైదరాబాద్ ప్రజలు ఆయనకు ఓట్లు వేయలేదా?" అని సీఎం నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మిగిలిన 25 లక్షల టన్నులను కేంద్రంతో కొనిపించాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. బీజేపీలో ఉంటూ చీకట్లో ఇవతలి వాళ్లతో కిషన్ రెడ్డి సహకారం తీసుకుంటున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర సీఎంతో తుమ్మిడిహట్టి బ్యారేజీపై చర్చలు జరగకుండా కిషన్ రెడ్డే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలతో గోకున్నోడు ఎవరూ బాగుపడలేదని, ఈ నెల 15వ తేదీ తర్వాత ఆయన సంగతి బరాబర్ చెబుతామని హెచ్చరించారు.

### మల్కాజిగిరి ఆశీస్సులతోనే ఈ స్థాయికి

కొడంగల్‌లో ఎన్నికల్లో ఓటమి చెంది, రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలి కిందపడిపోయిన తనను మల్కాజిగిరి ప్రజలు ఎంపీగా గెలిపించి ఆశీర్వదించారని సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క పైసా ఆశించకుండా ఇక్కడి ఆడబిడ్డలు తనకు ఓట్లు వేశారని, ఆ ఎంపీ విజయమే తనను పీసీసీ అధ్యక్షుడిని చేసిందని, నేడు ముఖ్యమంత్రిని అయ్యేలా చేసిందని ఉద్వేగంగా చెప్పారు. గత ప్రభుత్వ సహకారం లేకపోవడం వల్లే ఎంపీగా ఉన్నప్పుడు మల్కాజిగిరిలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానన్నారు. ఇప్పుడు కాలం గిర్రున తిరిగి ముఖ్యమంత్రిని అయ్యానని, ఇక మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఏ ఎమ్మెల్యే ఉన్నా సరే నిధులు ఇచ్చే బాధ్యత తనదన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారు రాజిరెడ్డి పేరు పెట్టడం వెనుక ఎలాంటి రాజకీయం లేదని, ఆయన కుమారుడు లక్ష్మారెడ్డి బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ, 40 ఏళ్ల పాటు ఈ ప్రాంతానికి రాజిరెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగానే ఆ నిర్ణయం తీసుకున్నామన్నారు.

### సౌలభ్యం కోసమే 3 కార్పొరేషన్లు

గతంలో హైదరాబాద్‌లో శాఖల మధ్య సమన్వయం లేక అభివృద్ధి కుంటుపడిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. పోలీసు, మున్సిపల్ శాఖల పరిధి ఒకేలా ఉండేలా పాలనను వికేంద్రీకరించామని చెప్పారు. రాజకీయ స్వార్థం కోసం కాకుండా, కేవలం పరిపాలన సౌలభ్యం కోసమే కోర్ ప్రాంతాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌తో ప్రణాళికాబద్ధంగా నగరాన్ని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామన్నారు. సబర్మతి, గంగా, యమునా నదుల తరహాలోనే మూసీ ప్రక్షాళన చేపడుతున్నట్లు సీఎం ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల నల్గొండ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఆడబిడ్డలు కడుపుకోతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీని అంతర్జాతీయ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. నాగోల్ నుంచి గౌరెల్లి వరకు ఫేజ్-2 మూసీ ప్రక్షాళన చేస్తామని, వంద రోజుల్లో దీనికి సంబంధించిన కార్యాచరణ మొదలవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ప్లాంట్

**మొదటి పేజీ తరువాయి**

తయారీ రంగాల విస్తరణ, సెమీకండక్టర్ మెటీరియల్స్ పరిశోధన వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి ప్రపంచస్థాయి సాంకేతిక సంస్థలతో భాగస్వామ్యం భవిష్యత్తులో వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో లభిస్తున్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా చేసుకుని డీప్ మినరల్ ప్రాసెసింగ్ మరియు రేర్ ఎర్త్ ఎలిమెంట్ (ఆర్ఈఈ) రిఫైనింగ్ హబ్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని గిరెడ్మెట్ ప్రతినిధులను కోరారు. అదేవిధంగా, భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), పవన విద్యుత్ పరిశ్రమలకు అవసరమైన అధిక సామర్థ్య శాశ్వత అయస్కాంతాల తయారీని ప్రోత్సహించేందుకు నెల్లూరు జిల్లాలో నియోడైమియం-ఇనుము-బోరాన్ (ఎన్డీఎఫ్ఈబీ) మాగ్నెట్ల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలపై భాగస్వామ్యాన్ని పరిశీలించాలని సూచించారు. గిరెడ్మెట్‌కు ఉన్న రేర్ ఎర్త్ ప్రాసెసింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగిస్తూ పూర్తి స్థాయి రేర్ ఎర్త్ శాశ్వత అయ స్కాంతాల తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పా టు చేయాలని కోరారు. అలాగే, భారతీయ టెక్ కారిడార్‌లో ప్లగ్-అండ్-ప్లే పరిశోధనా మౌలిక సదుపాయాలతో కూడిన మెటలర్జీ, అల్ట్రా-ప్యూర్ సెమీకండక్టర్ మరియు ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహ-స్థాపనకు గిరెడ్మెట్ ముందుకు రావాలని ఆహ్వానించారు. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుంచి వ్యూహాత్మక అరుదైన లోహాలను వెలికితీసే ఆధునిక సాంకేతికతలను రాష్ట్రంలో అమలు చేసేందుకు కూడా భాగస్వామ్యం అవసరమని మంత్రి పేర్కొన్నారు.

### గిరెడ్మెట్ సంస్థ ప్రత్యేకత

1931లో స్థాపించబడిన గిరెడ్మెట్ సంస్థ ప్రస్తుతం రష్యా అణుశక్తి సంస్థ రోస్టం శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో కీలక పరిశోధన-డిజైన్ సంస్థగా కొనసాగుతోంది. రేర్ ఎర్త్ మూలకాలు, కీలక ఖనిజాలు, సెమీకండక్టర్ పదార్థాలు, అధిక శుద్ధి రసాయనాలు, అధునాతన లోహాల అభివృద్ధి రంగాల్లో ఈ సంస్థకు విశేష నైపుణ్యం ఉంది. మాస్కోలోని అత్యాధునిక ప్రయోగశాలలు, పైలట్-స్థాయి పరీక్షా కేంద్రాలు, డిజైన్ సదుపాయాలు రోసాటమ్ పారిశ్రామిక నెట్‌వర్క్‌తో అనుసంధానమై ఉండటంతో పరిశోధన ఫలితాలను పారిశ్రామిక ఉత్పత్తిగా మార్చగల సామర్థ్యం గిరెడ్మెట్‌కు ఉంది. ముఖ్యంగా రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, బ్యాటరీ రీసైక్లింగ్, వ్యూహాత్మక ఖనిజాల విలువ ఆధారిత వినియోగం, అధునాతన మెటీరియల్స్ అభివృద్ధి వంటి రంగాల్లో భారతదేశంతో సహకార అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ వనరుల ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు గిరెడ్మెట్ వంటి అంతర్జాతీయ సాంకేతిక సంస్థలతో భాగస్వామ్యం కీలకంగా మారే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ఈ మ్యూజియం 25వేల చదరపుమీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఏర్పాటయి ఉంది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు మ్యూజియంలో ప్రత్యేకం.

# 'జన్‌బంధన్' వేదికగా విపక్షాల సమావేశం

హక్కుపై దాడి వంటి కీలక అంశాలపై పార్లమెంట్ లోపల, బయట కేంద్రాన్ని ఉమ్మడిగా ఎలా నిలదీయాలనే దానిపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు.

### మమత ఎంట్రీ.. కేజ్రీవాల్, స్టాలిన్ దూరం?

ఈ భేటీకి సంబంధించి ప్రాంతీయ పార్టీల అధినేతల వైఖరి ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయినప్పటికీ, కూటమి బలోపే తానికి మమతా బెనర్జీ గట్టి మద్దతు ప్రకటిం చారు. ఆదివారమే ఆమె కోల్‌కతా నుంచి ఢిల్లీకి చేరుకు న్నారు. ఒకే లక్ష్యం.. స్పష్టమైన సంకల్పంతో కలవబో తున్నామని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ ట్వీట్ చేశారు. భవిష్యత్తులో కూటమిని నడిపించే వ్యూహక ర్తగా మమత కీలక పాత్ర పోషించబోతున్నట్లు స్పష్టమ వుతోంది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సమా వేశా నికి దూరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలు స్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌తో ఉన్న విభేదాల వల్లే అరవింద్ కేజ్రీవాల్ ఈ భేటీకి దూరంగా ఉంటూ సొంత వ్యూహాలకు పదును పెడుతున్నట్లు సమాచారం.

### కూటమిని వేధిస్తున్న అంతర్గత విభేదాలు

23 పార్టీలు వస్తున్నాయని కాంగ్రెస్ చెప్తున్నా కూటమిలోని ముగ్గురు కీలక మిత్రుల మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అక్కడ ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీతో జతకట్టడంపై డీఎంకే తీవ్ర ఆగ్రహంతో ఉంది. కాంగ్రెస్ తమకు ద్రోహం చేసిందని ఆరోపిస్తూ మాజీ సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. అలాగే, కేరళ ఎన్నికల ప్రచారంలో లెఫ్ట్ పార్టీలు, బీజేపీతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని రాహుల్ గాంధీ, ఖర్గే ఆరోపించడంపై సీపీఎం తీవ్ర అసంతృప్తితో ఉంది. దీనిపై వివరణ ఇవ్వాలని సీపీఎం నేత ఎం.ఎ. బేబీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాశారు. అయినప్పటికీ, కూటమి స్ఫూర్తి కోసం ఈ మీటింగ్‌కు తమ ప్రతినిధిని పంపుతున్నట్లు లెఫ్ట్ వెల్లడించింది.

### మిషన్ లేదు.. విజన్ లేదు: బీజేపీ ఎద్దేవా

ఇండియా కూటమి భేటీపై అధికార పక్షం బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ కూటమికి మిషన్ లేదు.. విజన్ లేదు.. కేవలం కన్ఫ్యూజన్ మాత్రమే ఉంది అని బీజేపీ నేతలు తేలిగ్గా తీసిపారేశారు. ఏది ఏమైనప్పటికీ, అంతర్గత అలకలు, విభేదాలను పక్కన పెట్టి, జన్‌బంధన్ వేదికగా ఇండీ కూటమి ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోబోతోంది అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# ఏపీ సరికొత్త కుట్ర, రేవంత్ సర్కార్ జల ద్రోహం

**మొదటి పేజీ తరువాయి**

నదుల అనుసంధానం ముసుగులో తెలంగాణకు జరుగుతున్న తీవ్ర అన్యాయాన్ని, కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాన్ని ఆయన ఎండగట్టారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన తన గురువు చంద్రబాబు నాయుడి మెప్పు పొందేందుకే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు.నదుల అనుసంధానం కింద గతంలో గోదావరి జలాలను తెలంగాణలోని సమ్మక్క సాగర్ నుంచి నాగార్జున సాగర్ మీదుగా కావేరికి తరలించాలనేది అసలు ప్లాన్ అని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ, దీనివల్ల ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం తెలంగాణకు అదనంగా 45 టీఎంసీల వాటా దక్కుతుంది. ఈ హక్కులు తెలంగాణకు రాకుండా చేసేందుకే ఏపీ ప్రభుత్వం కుట్ర పన్ని, అసలు తెలంగాణ భూభాగమే టచ్ కాకుండా నేరుగా పోలవరం నుంచి నల్లమల సాగర్ మీదుగా కావేరికి లింక్ చేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. జాతీయ ప్రాజెక్టు హోదాతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నీళ్లను తరలించుకుపోయేలా ఏపీ స్కెచ్ వేసిందన్నారు.సమ్మక్క సాగర్ మీదుగా నీటిని తరలిస్తే కేవలం 97 మీటర్ల లిఫ్ట్ సరిపోతుందని, రూ.48 వేల కోట్ల ఖర్చు అవుతుందని హరీశ్ రావు వివరించారు. కానీ, ఏపీ ప్రతిపాదిస్తున్న పోలవరం - బనకచర్ల మార్గానికి 250మీటర్ల లిఫ్ట్ అవసరమని, దీనికి ఏకంగా రూ.82 వేల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక భారం, నిర్వహణ కష్టమని తెలిసినా కేవలం ఏపీ ఎంపీల ఒత్తిడికి తలొగ్గే కేంద్రం ఈ అడ్డగోలు నిర్ణయాలకు మొగ్గుచూపుతోందని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ వాటాగా దక్కాల్సిన 211 టీఎంసీల నీటి హక్కులను శాశ్వతంగా కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.నదుల అనుసంధానంపై ఢిల్లీ వేదికగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అత్యంత రహస్యంగా సమావేశాలు జరిగాయని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ ఇంజనీర్లను పక్కనపెట్టి, గతంలో తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పనిచేసిన చంద్రబాబు నమ్మినబంటు ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్రం తరఫున పంపడం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. బనకచర్లకు అనుమతి ఇస్తే, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీల ఎన్ఓసీ ఇవ్వాలని సీఎం రేవంత్ అడగడం ఆయన అవగాహనలేమికి నిదర్శనమన్నారు. ట్రిబ్యునల్ పరిధిలో తేలాల్సిన 700 టీఎంసీల వాటాను వదిలేసుకుని, కేవలం 90 టీఎంసీలకు ఒప్పందం చేసుకోవడం దారుణమన్నారు.రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులుగా మిగలొద్దని హితవు పలికారు. రేవంత్ సర్కార్ తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి పోలవరం-కావేరి లింకుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో ప్రజలను ఏకం చేసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఉద్యమం చేపడతామని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

శ్వేత

# సంపాదకీయం

సోమవారం 8-6-2026

## ప్రజలను పట్టించుకోవాలి

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ద

ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

# 'టీవీకే' తరఫున పోటీ?

**తిరుచ్చి ఈస్ట్ ఉప ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు వార్తలు**

**ఎంట్రీపై స్పందించిన లారెన్**

**గురువారం ఉదయం 9:30 గంటలకు కీలక ప్రకటన!**



చెన్నై, జూన్ 07: ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాఘవ లారెన్స్ రాజకీయ అరంగేట్రంపై గత కొన్ని రోజులుగా తమిళనాడు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. దళపతి విజయ్ నేతృత్వంలోని 'టీవీకే' (తమిళగ వెట్రి కళగం) పార్టీ తరఫున ఆయన రాబోయే ఉప ఎన్నికల్లో బరిలోకి దిగబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సంచలన ప్రచారంపై తాజాగా రాఘవ లారెన్స్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ అసలు విషయాన్ని వెల్లడించారు.

గత ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుండి పోటీ చేసి రెండింటిలోనూ ఘన విజయం సాధించారు. అయితే, నిబంధనల ప్రకారం ఆయన పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకుని, తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో త్వరలోనే ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఖాళీ స్థానం నుంచే విజయ్ నేతృత్వంలోని టీవీకే తరఫున లారెన్స్ పోటీ చేస్తారనే వార్తలు గుప్పుమన్నాయి.

**ఎక్స్‌లో లారెన్స్ క్లారిటీ**

ఈ ఊహాగానాలపై రాఘవ లారెన్స్ స్పందిస్తూ ప్రస్తుతం తాను సినిమాలతో బిజీగా ఉన్నట్లు పేర్కొన్నారు. "తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుండి నేను పోటీ చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. దీనిపై స్పష్టత కోరుతూ అనేక మంది మిత్రులు నాకు ఫోన్లు చేస్తున్నారు. ప్రస్తుతం నేను 'బెంజ్' సినిమా షూటింగ్‌తో ఎంతో బిజీగా ఉన్నాను. ఈ నెల 10వ తేదీతో ప్రస్తుత షెడ్యూల్ ముగుస్తుంది. మా అమ్మగారి ఆశీస్సులతో నా జీవితానికి సంబంధించిన ఒక అత్యంత ముఖ్యమైన విషయాన్ని గురువారం ఉదయం 9:30 గంటలకు అధికారికంగా ప్రకటిస్తాను." అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**సేవలోనూ 'సూపర్‌స్టార్'.. అందుకే ఇంత ఆసక్తి!**

రాఘవ లారెన్స్ కేవలం వెండితెరపైనే కాకుండా, క్షేత్రస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన తల్లి పేరు మీద అనాథలు, వృద్ధులకు చేతనైన సాయం అందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. సాయం కోసం తన వద్దకు వచ్చే వారిని ఎవరినీ నిరాశపరచకుండా ఆదుకోవడం లారెన్స్ ప్రత్యేకత. ఇబ్బందుల్లో ఉన్నవారు ఎవరైనా సామాజిక మాధ్యమాల ద్వారా తనకు ట్యాగ్ చేసి సాయం కోరితే, తన టీమ్ మరియు స్నేహితుల సహాయంతో వారిని వెతికి మరీ ఆదుకుంటారు. బలమైన సేవా నేపథ్యం ఉండటం వల్లే లారెన్స్ రాజకీయ ఎంట్రీ వార్తలపై ప్రజల్లో భారీ ఆసక్తి నెలకొంది. తనకు ఎంతో ఇష్టమైన గురువారం రోజున ఆయన చేయబోయే ఆ కీలక ప్రకటన రాజకీయ ప్రవేశం గురించేనా కాదా అని అభిమానులతో పాటు రాజకీయ వర్గాలూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నాయి.

## జనసేనాని సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

బలోపేతం చేశామ ని, అయితే కొందరు నాయకుల ప్రవ ర్తన ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు.జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు, సమన్వయ లోపం, క్రమ శిక్షణరాహిత్యం కారణంగా పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు కమిటీల్లోని ఇతర సభ్యులను కూడా తమ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

క్రమశిక్షణ లేని చోట పార్టీ వ్యవస్థ సక్రమంగా నడవదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ వివరించారు. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త కమిటీ నియామకం జరిగే వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను జనసేన కేంద్ర కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

## నేడు పశ్చిమ గోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటన

మొదటి పేజీ తరువాయి

వివరాలను చదివించి వీటిని పంపిణీ చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 11:15 గంటలకు ప్రజా వేదిక సభలో పాల్గొననున్న సీఎం, మధ్యాహ్నం రైతులతో ప్రత్యేకంగా భేటీ అయి, ఆ తర్వాత 3:15 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించి సాయంత్రం అమరావతికి తిరుగు పయనమవుతారు.

**6 నెలల్లో 26.46 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ..**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జనవరి నుంచి రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి గత 6 నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించింది. రానున్న 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి, 67.32 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. కాగా, భూ రికార్డుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్లాక్‌చైన్ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తోంది. దీని ద్వారా ప్రతీ భూ యూనిట్‌కు ఒక శాశ్వత బ్లాక్‌చైన్ ఐడీ కేటాయిస్తుండటంతో రికార్డులను తారుమారు చేయడం అసాధ్యం కానుంది. అలాగే సర్వే నుంచి తుది రికార్డుల తయారీ వరకు ప్రతి దశలోనూ రైతుల ఈ-కేవైసీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఫైర్

**నన్ను ఆపేటోడు ఇంకా పుట్టలేదని కేంద్ర మంత్రి ఎదురు దాడి**

**పది పార్టీలు మారిన చరిత్ర నాది కాదు.. పుట్టుక, చావు బీజేపీలోనే**

**దమ్ముంటే కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**తలుచుకుంటే మీ నాయకులు గ్రామాల్లో తిరగలేరంటూ హెచ్చరిక**

హైదరాబాద్, జూన్ 07: కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను గ్రామాల పొలిమేరలు దాటనివ్వబోమంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపా నాయకులు తీవ్రస్థాయిలో స్పందించారు. తనను పొలిమేర దాటకుండా ఆపేటోడు ఇంకా తెలంగాణలో పుట్టలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి తన గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసున్నారు. రేవంత్ రెడ్డిలా పది పార్టీలు మారిన చరిత్ర తనది కాదన్నారు. తన పుట్టుక, చావు రెండూ బీజేపీలోనేనని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి ఎంత రెచ్చగొట్టినా తాను తొందరపడనని, ముందుగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి.. ఆ తర్వాత మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. హామీల అమలులో విఫలమైతే దళితులు, బీసీలు సీఎం ఇంటిని ముట్టడించి ధర్నాలు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

**భాష అదుపులో పెట్టుకోండి..**

ముఖ్యమంత్రి తన భాషను అదుపులో పెట్టుకోవాలని, బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను వాళ్ల వాళ్ల ప్రాంతాల్లో తిరగకుండా చేస్తారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నేతలు అవినీతి, కమీషన్ల దందాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్ మెంట్, ధాన్యం కొనుగోళ్లలో విఫలమై, రైతుల భూములను లాక్కొని పరిహారం ఇవ్వకుండానే ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన చేయడం దారుణమన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అవినీతి బాగోతాలపై ఎంక్వయిరీలు వేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీ మెప్పు కోసమే హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని, కాంగ్రెస్ తీసుకొచ్చిన ఈ రజాకార్ల పాలనను ప్రజలు త్వరలోనే సాగనంపుతారని ధ్వజమెత్తారు.

## భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా

# గరిసెల సురేందర్ ముదిరాజ్ నియామకం

**భద్రాచలం, జూన్ 7**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమానికి సంబంధించి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా గరిసెల సురేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.



గరిసెల సురేందర్ ముదిరాజ్ తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధిగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్నారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించినందుకు, ఏఐసిసి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజ్ గారికి మరియు టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... "పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. భద్రాచలం నియోజకవర్గంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహిస్తాను. స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు బూత్ లెవెల్ ఏజెంట్లను సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను" అని వెల్లడించారు.




# నిద్రమత్తుతో బస్సు బోల్తా

**మంచిర్యాల, జూన్ 7 :**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ సమీపంలో ఆదివారం ఉదయం టీజీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి స్వల్ప గాయాలు కాగా, పెను ప్రమాదం మాత్రం తృటిలో తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం వల్ల పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించకుండా తప్పించుకుంది. సమాచారం ప్రకారం కొత్తగూడెం నుంచి బెల్లంపల్లి వైపు బయలుదేరిన టీజీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఉదయం మందమర్రి సమీపానికి చేరుకుంది. ప్రయాణం కొనసాగుతున్న సమయంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి జాతీయ రహదారి నుంచి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లింది.



# స్త్రీ రైడ్‌కు శ్రీకారం

**హైదరాబాద్, జూన్ 7 ::**

మహిళల భద్రత, సాధికారత, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో మహిళాభద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "స్త్రీ రైడ్" కార్యక్రమాన్ని రాష్ట్ర పోలీసు శాఖాధిపతి సి.వి. ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు భద్రత కల్పించడంతో పాటు వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ పోలీసులు కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను ఉద్దేశించి మాట్లాడిన సి.వి. ఆనంద్, సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భద్రతతో కూడిన వాతావరణం కల్పించడం మాత్రమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే చర్యలను కూడా పోలీసు శాఖ చేపడుతోందని వివరించారు. మహిళలు తమ సామర్థ్యాలను గుర్తించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేటి పరిస్థితుల్లో మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని ఆయన అన్నారు. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.

# నిర్మాణ రంగంలో జాతీయ స్థాయిలో సత్తా చాటిన 'నాక్'

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశంసలు

**హైదరాబాద్, :**

నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే సంస్థకు మరియు డైరెక్టర్ జనరల్ శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డికి దక్కిన అవార్డుల పట్ల రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

### జాతీయ స్థాయిలో పురస్కారాల పంట

న్యూఢిల్లీలో జూన్ 5న జరిగిన ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో మెరిసింది: ప్లాటినం అవార్డు: 'నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం' విభాగంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది.



గోల్డ్ అవార్డు: ప్రభుత్వ సేవలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను చీూజ డైరెక్టర్ జనరల్, జజు శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డిని గోల్డ్ అవార్డు వరించింది. ఈ విజయాల నేపథ్యంలో శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డి మరియు చీూజ బృందం సభ్యులు మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, అవార్డులను ప్రదర్శించారు. యువతకు ఉపాధి కల్పనలో కీలక పాత్ర

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో నాణ్యమైన శిక్షణను అందిస్తూ యువతకు ఉపాధి కల్పించడంలో చీూజ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా 2025-26 సంవత్సరంలో 21,016 మంది నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చి, వారిని ఉపాధి బాట పట్టించడం గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నైపుణ్యాభివృద్ధి రంగానికి ఈ అవార్డులు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టాయని మంత్రి వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని యువతకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణను అందించి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చూడాలని మంత్రి ఆకాంక్షించారు.

# బీసీల అభివృద్ధిపై మేధోమథనం

**హైదరాబాద్, జూన్ 7 :**

బీసీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారులు, సహాయ బీసీ సంక్షేమ అధికారులతో ఈ నెల మూడవ వారంలో మేధోమథన సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీసీ వర్గాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను మరింత ఫలవంతంగా అమలు చేయడంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థుల విద్యా పురోగతిని సమగ్రంగా అంచనా వేసేందుకు అకాడమిక్ ప్రొఫైల్ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి విద్యా స్థాయి, ప్రతిభ, అవసరాలపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా సహకారం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. బీసీ హాస్టళ్లలోని విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆయన అన్నారు. క్రీడలు, విద్య రెండింటినీ సమానంగా ప్రోత్సహించాలని మంత్రి పేర్కొన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఉద్యోగ నియామక ప్రకటనలను దృష్టిలో ఉంచుకుని బీసీ స్టడీ సర్కిళ్లలో ప్రత్యేక శిక్షణ తరగతులు, ఫౌండేషన్ కోర్సులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు నాణ్యమైన శిక్షణ అందించడమే లక్ష్యమని తెలిపారు. బీసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మరింత మెరుగైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

# ఆన్‌లైన్ ఫార్మసీలపై డీసీఏ కొరడా

**హైదరాబాద్, జూన్ 7 :**

ఆన్‌లైన్ ఫార్మసీలతో అనుబంధం ఉన్న మెడికల్ షాపుల్లో నిబంధనల అమలును పరిశీలించేందుకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. జూన్ 6న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో మొత్తం 166 మెడికల్ షాపులను అధికారులు పరిశీలించారు. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం--1940 నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయా లేదా అన్న అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఆన్‌లైన్ మందుల సరఫరా సేవలతో అనుబంధం ఉన్న 159 మెడికల్ షాపులు, ఆన్‌లైన్ వ్యాపార వేదికలతో అనుసంధానమైన మరో 7 మెడికల్ షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. విక్రయ బిల్లుల నిర్వహణలో లోపాలు, వైద్యుల చీటీ ఆధారంగా విక్రయించాల్సిన మందులకు సంబంధించిన నమోదుల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే కొనుగోలు బిల్లులను సమర్పించకపోవడం, చెల్లుబాటు అయ్యే వైద్యుల చీటీ లేకుండానే మందులు విక్రయించడం, నమోదిత ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా మందుల విక్రయం జరపడం వంటి ఉల్లంఘనలు కూడా బయటపడినట్లు వెల్లడించారు.



ఔషధాల విక్రయానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 41 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. సంబంధిత యాజమాన్యాల నుంచి వివరణలు అందిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది. ఆన్‌లైన్ ఫార్మసీలతో అనుబంధం ఉన్న మెడికల్ షాపులు సహా అన్ని ఔషధ విక్రయ కేంద్రాలు చట్టబద్ధ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. మందుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ, రోగుల భద్రతను కాపాడేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించింది.

# ఈఆర్వో భవనానికి భట్టి శంకుస్థాపన



**ఖమ్మం, జూన్ 7 :**

ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో నిర్మించనున్న నూతన విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయ భవనానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ప్రజలకు విద్యుత్ శాఖ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నూతన ఈఆర్వో కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా విద్యుత్ సంబంధిత సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందనున్నాయని అన్నారు. వినియోగదారుల ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం, కొత్త కనెక్షన్ల మంజూరు తదితర సేవలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని వివరించారు. ప్రస్తుతం విద్యుత్ శాఖ సేవల కోసం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సేవల నాణ్యతను పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్థాయి సేవలు అందేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను విస్తరించడం, సేవల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా అభివృద్ధికి మరింత ఊతం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ముదిగొండలో నిర్మించనున్న ఈఆర్వో కార్యాలయం పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కోహెడ రైతులకు బీజేపీ అండ

**హైదరాబాద్, జూన్ 7 :**

రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామానికి చెందిన రైతుల ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిసింది. ప్రతిపాదిత సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియపై రైతులు తమ ఆందోళనలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలను పూర్తిగా విన్న రామచందర్ రావు, వారికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భూముల స్వాధీనానికి ముందు రైతులతో సమగ్రంగా చర్చించకపోవడం, సరైన నష్టపరిహారం అంశంపై స్పష్టత లేకపోవడం వల్ల తీవ్ర ఆందోళన నెలకొందని వివరించారు. తమ అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



రైతుల సమస్యలపై స్పందించిన రామచందర్ రావు, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా తీసుకునే నిర్ణయాలు వివాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. రైతుల న్యాయమైన ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల అభ్యంతరాలు కొనసాగుతున్నప్పటికీ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం వల్ల అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. ఎర్త్‌మూవర్లతో పనులు ప్రారంభించడం, ఆందోళనలకు దిగిన రైతులపై చర్యలు తీసుకోవడం వంటి పరిణామాలు ఆందోళనకరమని పేర్కొన్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. కోహెడ రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు.ం

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గుండెపోటుతో రైతు మృతి

మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట అర్బన్, ::

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగడం వల్లే రైతు కనకయ్య గుండెపోటుకు గురై మృతి చెందాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రంలో పల్లవేని కనకయ్య(50) శుక్రవారం రాత్రి గుండెపోటుకు మృతి చెందాడు. శనివారం గ్రామంలో కనకయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతు కనకయ్య పండించిన ధాన్యాన్ని గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి 45 రోజుల క్రితం తీసుకొచ్చారని, నిర్వాహకులు కొనుగోళ్లను ఆలస్యం చేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో కనకయ్య ఆవేదన చెం దాడని, తడిసింది కొను గోలు చేయాలని ప్రాధే యపడితే 40 సంచుల ధాన్యం కోత పెట్టారన్నారు. ఈ విష యాన్ని కనకయ్య ఇంట్లో, గ్రా మంలో తెలిసిన వారికి చెబుతూ మదనపడ్డారని, ఈ క్ర మంలోనే ఒత్తిడికి గురై నిద్రలోనే గుండె పోటు వచ్చి మరణించాడని, ఇది కచ్చితంగా ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చోని 80–90 శాతం ధాన్యం కొనుగోలు చేశామని చెబు తున్న ప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రతి గ్రామంలో 30–40 శాతం వరకు కేంద్రాల్లోనే ధాన్యం ఉందన్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు రెండు నెలలుగా కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారని, ప్రతి క్వింటాకు 4–5 కిలోలు కోత పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారన్నారు.

# దొంతిలో ప్రారంభమైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహా సభలు



శివ్వంపేట, ::

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతి ఫంక్షన్ హాల్లో వ్యవసాయ కార్మిక సంఘం తొమ్మిదో జిల్లా మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, ఎస్సీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య హాజరై మాట్లాడారు. వీబీజీరామ్‌జీ చట్టం రద్దు కోసం పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ మిగులు భూములు పేదలకు పంపిణీ చేయాలన్నారు. జూన్ 20 నుంచి 22 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు దేవయ్య, జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాగరాజు, సహాయ కార్యదర్శి జె.సంతోష్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి యం.లక్ష్మినర్సయ్య, పీఎన్ఎం జిల్లా అధ్యక్షులు శేఖర్, యూఈఈయూ జిల్లా కార్యదర్శి రవిప్రసాద్, రాజు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు డి. మల్లేష్, ఐద్వా జిల్లా కన్వీనర్ నాగమణి, కేజీకెఎస్ జిల్లా కార్యదర్శి లచ్చగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరకొర సమాచారంతో గదులు అద్దెకివ్వొద్దు: సజ్జనర్



హోటల్ రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సజ్జనర్. చిత్రంలో డీసీపీ శిల్పవల్లి

హైదరాబాద్, ::

హోటళ్లు, లాడ్జీల్లో మైనర్లకు గదులు ఇవ్వొద్దని నగర సీపీ సజ్జనర్ తెలిపారు. గుర్తింపు కార్డుల్లో వయసును ధ్రువీకరించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా శుక్రవారం రాత్రి 11 నుంచి 1 వరకు 5 వేల మంది పోలీసులు నగరవ్యాప్తంగా 562 హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. అంతర్రాష్ట్ర దొంగలు, అసాంఘిక కార్యకలాపాలకు కొన్ని హోటళ్లు కేంద్రంగా మారాయనే సమాచారంతో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. రికార్డులు, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. నాంపల్లి, అమీర్‌పేట్‌లోని పలు లాడ్జీలను సీపీ సజ్జనర్ స్వయంగా పరిశీలించారు. తనిఖీల్లో అదనపు సీపీలు ఎం.శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, శ్వేత, డీసీపీలు చైతన్యకుమార్, శిల్పవల్లి, శ్రీనివాస్, చంద్రమోహన్, రమణారెడ్డి, రాజేశ్, అరవిందబాబు, లావణ్యనాయక్ జాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రంగులతో మాయ.. నాణ్యత ఏమాయె



సంగారెడ్డి మున్సిపాలిటీ, సిద్దిపేట ::

సిద్దిపేటలోని ఓ మార్టులో ఇన్‌స్టాంట్ పరోటా కొనుగోలు చేశారు. దానికి ఫంగస్ రాగా ఫిర్యాదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి జరిమా విధించారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి సమీపంలోని కొన్ని హోటళ్లలో ఆహార పదార్థాల్లో నిషేధిత రంగులు కలుపుతున్నారు. దీనిపై అధికారులకు వినియోగదారులు ఫిర్యాదు చేస్తే.. తనిఖీలు చేసి చేతులు దులుపుకొన్నారు. ఎక్కడ చూసినా.. కల్తీ ఆహారం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన ఆహార కల్తీ నియంత్రణ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు తనిఖీలు చేస్తున్న అధికారులు.. ఆ తరువాత పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో హోటళ్లు, బేకరీలు, ఆహార విక్రయ సంస్థలపై నియంత్రణ లేకుండాపోయింది. ఆహార కల్తీ నియంత్రణ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. అయినా క్షేత్ర స్థాయిలో ఆశించిన స్థాయిలో తనిఖీలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. నేడు ప్రపంచ ఆహార పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కథనం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పట్టణాలతో పాటు గ్రామాల్లో వేల సంఖ్యలో హోటళ్లు, బేకరీలు ఉన్నాయి. చాలాచోట్ల వీటిలో నాణ్యత ప్రశ్నార్థకమైందనే విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఏడాది కిందట తనిఖీలు చేసేందుకు సంచార వాహనాన్ని కేటాయించారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించే యంత్రాలు ఉన్నాయి.

# ధన్నారంలో సంపూర్ణ మద్యపాన నిషేధం



వికారాబాద్, ::

కాలనీలలో ఎక్కడ కూడా మద్యం అమ్మకాలు విక్రయించ వద్దని తీర్మానం చేసినట్లు కౌన్సిలర్ సుధాకర్ తెలిపారు. ఆదివారం వికారాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు ధన్నారం గ్రామంలో గ్రామస్తులు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం గుట్కా ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు కొనుగోళ్లు సేవించడం పూర్తిగా నిషేధిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే మద్యం అమ్మే వారికి రూ. 5 లక్షలు కొనుగోలు చేసేవారికి రూ. 2 లక్షల జరిమానా విధిస్తామని కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. గ్రామస్తులంతా కలిసి మద్య నిషేధ అమలు కమిటీని ఏర్పాటు చేసి 24 గంటల నిఘాను కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. యువత భవిష్యత్తును కుటుంబాలను కాపాడుకునేందుకు తీసుకున్న ఈ నిర్ణయానికి ఎక్సైజ్ పోలీస్ శాఖలు సహకరించాలని గ్రామ పెద్దలు కోరారు. దాన్నారం గ్రామ ప్రజలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని మీమీ గ్రామాలలో కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడే మీ గ్రామాలు బాగుపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిబంధనలకు పాతర.. పైరవీల జాతర



పురపాలికల్లో అనుమతుల్లేని నిర్మాణాలు

గజ్వేల్, దుబ్బాక, చేర్యాల ::

ఇళ్లు, భవన నిర్మాణాల అనుమతులను సులభంగా పొందేలా ప్రభుత్వం బిల్డ్ నౌ పోర్టల్ తీసుకొచ్చింది. అక్రమాలను నిలువరించాలని టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. అయినా క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. జిల్లాలోని పలు మున్సిపాలిటీలలో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతూ పైరవీలు, రాజకీయ పలుకుబడితో పని కానిచ్చేస్తున్నారు. బిల్డ్ నౌలో అనుమతి తీసుకోకుండా ఫీజులు ఎగ్గొడుతున్నారు. కొందరు నేతలు పలుకుబడిని ఉపయోగించి దర్జాగా నిర్మాణాలు చేయిస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు కొర్రీలు పెడుతూ అనుమతులను తిరస్కరిస్తుండటం వెనక వసూళ్ల మతలబు ఉందని స్థానికంగా చర్చ సాగుతోంది. గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో ప్రధాన రోడ్ల వెంట పలు దుకాణాల సముదాయాలు, ఇళ్లకు అనుమతి లేకున్నా రాజకీయ అండదండలతో నిర్మాణాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు పూర్తిగా వసూళ్లపైనే దృష్టి పెడుతున్నట్లు సమాచారం. దుబ్బాక, చేర్యాలలో వసూళ్ల దందా నడుస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏడాదిలో ఇళ్లకు సంబంధించి 180 దరఖాస్తులు వస్తే అందులో 140 అనుమతిచ్చారు. అనుమతులు లేవని నాలుగు నిర్మాణాలను అడ్డుకున్నారు. మరో 24 నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు.

# ఖరీఫ్ సాగు ఖరారు.. పనుల జోరు

టంగాయిపల్లిలో చెరువు మట్టిని తరలిస్తున్న రైతులు

మెదక్ ::

వర్ష కొనుగోళ్లు కొనసాగుతుండగానే.. అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలకు అధికారులు ప్రణాళిక ఖరారు చేశారు. జిల్లాలో అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. ఏటా రెండు పంటలను సాగు చేస్తున్నారు. ఘనపూర్, హల్దీ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోరుబావులే వీరికి ఆధారం. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు మొగ్గు చూపుతుంటా రు. ఇటీవల ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఖరీఫ్‌లో వివిధ పంటల సాగు అంచనా పెరిగింది. గతేడాది అన్ని రకాలవి కలిపి 3.65 లక్షల ఎకరాలు ఉ ండగా, ఈసారి 3.68 లక్షలకు పెరిగింది. వరి, పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, పెసర గతేడాది కంటే పెరగనుంది. 2025లో వరి 3.15 లక్షల ఎకరాలు అంచనా వేయగా, ఈసారి అదనంగా 1,015 ఎకరాలకు పెంచారు. పత్తి అదనంగా 417, మొక్కజొన్న 374 ఎకరా ల్లో పండించనున్నారు. గతేడాది ఆయిల్‌పామ్ 1,202 ఎకరాలు ఉండగా, 2,500 ఎకరాలకు చేరనుంది. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంలో భాగం గా పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ అందిస్తున్నారు. జనుము – 3 వేల క్వింటాళ్లు, జీలుగ 4 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. 26,500 వేల మె.ట. యూరియా, 2,420 మె.ట. డీఏపీ, 2,317 మె.ట. ఎంవోపీ , 1,153 మె.ట. ఎస్ఎస్‌పీ, 27,480 మె.ట. కాంప్లెక్స్ కలిపి మొత్తం 59,870 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చే సీజన్‌కు అవసరం అవుతాయి. గతేడాది 57,715 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి.

# పల్లె జనం.. సమస్యలతో సతమతం

కనీస సదుపాయాల కొరత



సంగారెడ్డి టౌన్, జహీరాబాద్ ::

జిల్లాలోని చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. కనీస సదుపాయాల కొరతతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యధిక జనాభా పల్లెల్లో ఉంటున్నప్పటికీ.. అందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉండటం లేదనే విమర్శలున్నాయి. పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు అధికారంలోకి వచ్చినా.. గ్రామీణులు సమస్యల మధ్యే సహవాసం చేస్తున్నారు. గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చే నిధులే ఎక్కువ. పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో గతంలో నిలిపివేసిన నిధుల్ని సైతం ఇటీవల విడుదల చేసింది. జిల్లాకు రూ.43 కోట్లు విడుదలయ్యాయి. వీటితో పాటు పన్నుల ద్వారా రూ.20కోట్లు సమకూరాయి. నిధులు అందుబాటులో ఉన్నా.. సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకపోయినా బిల్లులు డ్రా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అందుబాటులో ఉన్న నిధులు సద్వినియోగమయ్యేలా చూస్తాం. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. మండల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఎక్కడైనా అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు ఉంటే ప్రాధాన్య క్రమంలో చేపడుతున్నాం.



# అరుణాచలం.. ప్రయాణం సులభతరం

ప్రత్యేక, రెగ్యులర్ రైళ్ల ప్రవేశంతో తప్పిన తిప్పలు

హైదరాబాద్ ::

నగరం నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి టెర్మినల్ నుంచి ప్రత్యేక, రెగ్యులర్ రైళ్లను ప్రవేశపెట్టి ప్రయాణాన్ని మరింత సులభతరం చేసింది. ప్రస్తుత చర్లపల్లిస్టేషన్ అభివృద్ధి, అక్కడి నుంచి నడిచే రైళ్లతో భక్తులకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. గతంలో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి నుంచి అరుణాచలానికి నేరుగా వెళ్లే రోజువారీ రైళ్లు లేవు. ప్రయాణికులు తొలుత తిరుపతి, చెన్నై లేదా బెంగళూరు చేరుకొని అక్కడి నుంచి బస్సు లేదా లోకల్ రైళ్లలో అరుణాచలం వెళ్లాల్సి వచ్చేది. దీంతో డబ్బు, సమయం వృథా అయ్యేవి. వారానికి ఒకసారి నడిచే కొన్ని వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాచిగూడ– మధురై, కాచిగూడ–నాగర్‌కోయిల్ ప్రత్యేక రైళ్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. దీంతో పౌర్ణమి గిరిప్రదక్షిణ సమయాల్లో ఈ రైళ్లలో టికెట్లు దొరకడం కష్టంగా మారేది. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ నుంచి అరుణాచలం మీదుగా వెళ్లే రైళ్లు చర్లపల్లి–తిరుచిరాపల్లి ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో తిరుపతి, అరుణాచలం, శ్రీరంగం క్షేత్రాలను సందర్శించే అవకాశం లభించింది. చర్లపల్లి నుంచి బయల్దేరే ప్రత్యేక రైళ్లు దాదాపు 15గంటల్లోనే అరుణాచలం (తిరువణ్ణామలై) చేరవేస్తున్నాయి.



# కూలిన టిఫిన్ సెంటర్ పైకప్పు

మర్పల్లి ::

టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న శిథిల భవనం పైకప్పు కూలి నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో శనివారం ఉదయం 11.15 గంటలకు చోటుచేసుకుంది. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భవనం వినియోగంలో లేకపోవడంతో దాంట్లో ఇమ్రాన్ అనే వ్యక్తి టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్నాడు. మర్పల్లి మండల కేంద్రానికి చెందిన నజీర్, బిల్లిపురం రమేశ్ అల్పాహారం తినేందుకు వచ్చారు. మర్పల్లికే చెందిన చందన, కొత్లాపూర్‌కు చెందిన శివకుమార్ వరుసకు అన్నాచెల్లెళ్లు. చందన తల్లి అనారోగ్యానికి గురికావడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించి అల్పాహారం తీసుకెళ్లడానికి వచ్చారు. అంతలోనే భవనం పైకప్పు కూలడంతో వారంతా శిథిలాల కింద చిక్కుకుపోయారు. సర్పంచి రామేశ్వర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసే చర్యల్లో పాల్గొన్నారు. మోమిన్‌పేట సీఐ వెంకట్, మర్పల్లి ఎస్సై రవూఫ్ సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. కొద్ది దూరంలో ఉన్న పొక్లెయిన్లను రప్పించారు. శిథిలాలను తొలగించి ముందుగా నజీర్, రమేశ్‌ను బయటికి తీశారు. 40 నిమిషాల తరవాత చందన, శివకుమార్‌ను బయటికి తీసుకొచ్చారు. శివకుమార్‌కు శ్వాస తీసుకోవడానికి కష్టంగా మారడంతో కృత్రిమంగా అందించారు. నలుగురు క్షతగాత్రులను మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సిఫార్సు మేరకు సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# తగ్గిన బంగారం ధరలు వెండికీ భారీ కోత



**హైదరాబాద్, జూన్ 7 ::**

దేశంలో బంగారం, వెండి ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో విలువైన లోహాల ధరల్లో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాల నుకునే వారికి కొంత ఊరట లభిస్తోంది.ఆదివారం ఉదయం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,730గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. వెండి ధర కూడా తగ్గుతూ కిలోకు రూ.2.70 లక్షలుగా ఉంది.విజయవాడ మార్కెట్‌లోనూ దాదాపు ఇదే ధరలు నమోదయ్యాయి. బంగారం, వెండి ధరల క్షీణతతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.ఇతర ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా నమోదైంది. ముంబై లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,730గా, 22క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000గా కొనసాగుతోంది.దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది.మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, గత ఒక రోజులోనే దేశవ్యాప్తంగా మేలిమి బంగారం ధర సగటున రూ.3,000 వరకు తగ్గింది. అదే సమయంలో వెండి ధరలో కిలోకు సుమారు రూ.10,000 మేర కోత నమోదైంది.

# గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ పెంపు



**న్యూఢిల్లీ, జూన్ 7 ::**

దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలను మరోసారి పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. 14.2 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.29 పెంపు అమల్లోకి వచ్చింది. ఆదివారం నుంచి కొత్త ధరలు అమలులోకి రావడంతో మధ్య తరగతి, సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడనుంది.తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో గ్యాస్ సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942కు చేరింది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా ఇతర నగరాల్లో ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. గత మూడు నెలల వ్యవధిలో గృహ వినియోగ గ్యాస్ ధర పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం.పశ్చిమాసియా ప్రాంతంలో కొన సాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అంత ర్జాతీయంగా ముడి చమురు, సహజ వాయువు ధరలు పెరిగినట్లు చమురు రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా భారత దేశానికి ఇంధన సరఫరాలో కీలకమైన హర్మ్మాజ్ జలసంధి మార్గంలో ఏర్పడిన అంతరాయాలు దిగుమతివ్యయాలను పెంచినట్లు సమాచారం. దీంతో దేశీయంగా గ్యాస్ ధరల సవరణ అవసరమైందని సంస్థలు వెల్లడించాయి. ఇప్పటివరకు ప్రతి గ్యాస్ సిలిండర్‌పై భారీ నష్టాలను భరిస్తూ వస్తున్న చమురు సంస్థలు, తాజా ధరల పెంపు తర్వాత కూడా పూర్తిస్థాయిలో నష్టాల నుంచి బయటపడలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గత మార్చి నెలలో కూడా గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 మేర పెంచిన విషయం తెలిసిందే.ఇక పెట్రోల్, డీజిల్, సంపీడిత సహజ వాయువు ధరలు కూడా ఇటీవల పెరుగుదల బాట పట్టాయి. మే నెల మధ్య నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు గణనీయంగా పెరగగా, సంపీడిత సహజ వాయువు ధరల్లో కూడా పెరుగుదల నమోదైంది.




# మళ్లీ చిన్న కార్ల జోరు మధ్యతరగతి మొగ్గు

**న్యూఢిల్లీ, జూన్ 7 ::**

దేశీయ కార్ల మార్కెట్లో ఆసక్తికరమైన మార్పులు కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ, చిన్న కార్లు మరియు హ్యాచ్‌బ్యాక్ మోడళ్లకు మళ్లీ ఆదరణ పెరుగు తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, తొలిసారి కారు కొనుగోలు చేస్తున్న వినియోగదారుల నుంచి వీటికి మంచి స్పందన లభిస్తోంది.ఇటీవల విడుదలైన విక్రయ గణాం కాల ప్రకారం, చిన్న కార్ల విభాగంలో గణనీయమైన వృద్ధి నమోదైంది. మారుతి సుజుకీకి చెందిన ఆల్టో విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 90 శాతం పెరగగా, ఎస్-ప్రెస్సో అమ్మకాలు 254 శాతం, సెలెరియో విక్రయాలు 62 శాతం వృద్ధి చెందాయి. ఈ గణాంకాలు చిన్న కార్లపై విని యోగదారుల ఆసక్తి మళ్లీ పెరుగుతోందని సూచిస్తున్నాయి.ప్రస్తుతం వివిధ కార్ల మోడళ్ల కోసం వేచి ఉన్న వినియోగదారుల సంఖ్య సుమారు రెండు లక్షల యూనిట్ల స్థాయిలో ఉండగా, అందులో చిన్న కార్ల వాటా 30 వేల యూనిట్లకు పైగా ఉండటం విశేషం. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రధాన వాహన తయారీ సంస్థలు చిన్న కార్ల విభాగంపై మళ్లీ దృష్టి సారిస్తున్నాయి.చిన్న కార్లకు పెరుగుతున్న గిరాకీ వెనుక పలు కారణాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కార్ల ధరలు గణనీయంగా పెరగడంతో అనేక ఎస్‌యూవీ మోడళ్లు మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటులో లేకుండా పోయాయి. అంతేకాకుండా, ఎస్‌యూవీల నిర్వహణ ఖర్చులు, ఇంధన వ్యయం కూడా ఎక్కువగా ఉండటం వల్ల వినియోగదారులు ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నారు

# వంట నూనె ప్యాకెట్లపై కొత్త నిబంధనలు

**న్యూఢిల్లీ, జూన్ 7 ::**

వంట నూనె విక్రయాల్లో పారదర్శకత పెంచడంతో పాటు వినియోగదారులకు ధరల పోలికను సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై దేశంలో ఉత్పత్తి చేసే లేదా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వంట నూనెలను నిర్దిష్ట ప్రామాణిక ప్యాక్ పరిమాణాల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. వివిధ పరిమాణాల ప్యాకెట్ల కారణంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న గందర గోళానికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.కొత్త నిబంధనల ప్రకారం వంట నూనెలను 200 మిల్లీలీటర్ల నుంచి 20 లీటర్ల వరకు మొత్తం తొమ్మిది ప్రామాణిక పరిమాణాల ప్యాకెట్లలో మాత్రమే విక్రయించవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల పరిమాణాల్లో నూనె ప్యాకెట్లు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు ఒక బ్రాండ్ ధరను మరో బ్రాండ్‌తో సరైన విధంగా పోల్చలేకపోతున్నారు. ఈ సమస్యను నివారించడమే కొత్త విధానం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం పేర్కొంది.పామాయిల్, సోయాబీన్ నూనె, పొద్దుతిరుగుడు నూనె, ఆవ నూనె, వేరుశెనగ నూనె తదితర ప్రధాన వంట నూనెలన్నింటికీ ఈ నిబంధనలు వర్తించనున్నాయి.




# ఐటీ రిటర్నులు దాఖలు చేసే ముందు తెలుసుకోవాల్సిన కీలక అంశాలు




**న్యూఢిల్లీ, జూన్ 7 :**

ఆదాయ పన్ను రిటర్నుల దాఖలు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులు తాజా నిబంధనలు, మినహాయింపులు, డిడక్షన్లు, టీడీఎస్ పరిమితులు, పెనాల్టీలకు సంబంధించిన మార్పులను తెలుసుకోవడం అవసరం. 2026-27 అంచనా సంవత్సరానికి సంబంధించి పాత, కొత్త పన్ను విధానాల్లో కొన్ని కీలక నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, వృత్తి నిపుణులు, సీనియర్ పౌరులు తమ రిటర్నులు దాఖలు చేసే ముందు ఈ అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. పాత పన్ను విధానంలో వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, వ్యక్తుల సంఘాలకు వార్షిక ఆదాయంలో రూ.2.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. 60 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు గల సీనియర్ పౌరులకు రూ.3 లక్షల వరకు, 80 ఏళ్లు దాటిన సూపర్ సీనియర్ పౌరులకు రూ.5 లక్షల వరకు మినహాయింపు వర్తిస్తుంది. కొత్త పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.4 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు పాత విధానంలో రూ.50 వేల వరకు, కొత్త విధానంలో రూ.75 వేల వరకు ప్రామాణిక మినహాయింపు లభిస్తుంది. పాత పన్ను విధానంలో ప్రజా భవిష్య నిధి, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు, జీవిత బీమా ప్రీమియాలు, పిల్లల విద్యా ఫీజులు, గృహ రుణ అసలు చెల్లింపులపై సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు మినహాయింపు పొందవచ్చు. జాతీయ పెన్షన్ పథకం, అటల్ పెన్షన్ యోజనలో పెట్టుబడులపై సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద అదనంగా రూ.50 వేల వరకు మినహాయింపు ఉంటుంది.






# అదానీ దూకుడు అంబానీకి ఎదురుదెబ్బ

**న్యూఢిల్లీ, జూన్ 7 ::**

ఈ ఏడాది భారత కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ భారీ దూకుడు ప్రదర్శించగా, ముఖేష్ అంబానీ సంపద మాత్రం తగ్గుదల బాట పట్టింది. తాజాగా విడుదలైన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం, 2026లో గౌతమ్ అదానీ రోజుకు సగటున రూ.1,897 కోట్ల మేర సంపదను పెంచుకోగా, ముఖేష్ అంబానీ రోజుకు సగటున రూ.1,352 కోట్ల మేర నష్టపోయినట్లు వెల్లడైంది.ఈ భారీ వృద్ధితో గౌతమ్ అదానీ మరోసారి ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ప్రపంచ కుబేరుల జాబితాలో ఆయన 19వ స్థానాన్ని దక్కించుకోగా, ముఖేష్ అంబానీ ఒక స్థానం వెనక్కి జారి 20వ స్థానానికి చేరుకున్నారు.అదానీ గ్రూప్ మౌలిక సదుపాయాలు, హరిత ఇంధన రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతోంది. తాజా గణాంకాల ప్రకారం గ్రూప్ నిర్వహణ లాభం రూ.94,834 కోట్లకు చేరి సరికొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ప్రతి ఏడాది రూ.1.53 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడం ద్వారా గ్రూప్ విస్తరణ వేగవంతమైంది. దీంతో కంపెనీల షేర్లపై పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగి మార్కెట్ విలువ గణనీయంగా పెరుగుతోంది.

మరోవైపు ముఖేష్ అంబానీకి చెందిన వ్యాపార సామ్రాజ్యంలో ప్రధాన భాగమైన చమురు శుద్ధి, పెట్రోకెమికల్స్ రంగాలు అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలో ఏర్పడిన అనిశ్చితి కారణంగా విదేశీ పెట్టుబడిదారులు కొంత మేర పెట్టుబడులను ఉపసంహరించుకోవడం రిలయన్స్ షేర్లపై ప్రభావం చూపుతోంది.రిలయన్స్ వంటి భారీ మార్కెట్ విలువ కలిగిన సంస్థల్లో స్వల్ప శాతం షేరు ధర పతనం కూడా వేల కోట్ల రూపాయల మార్కెట్ విలువను తగ్గించే అవకాశం ఉంటుంది. పెట్రోకెమికల్స్, చమురు, రిటైల్ వ్యాపారాల్లో తాత్కాలిక ఒత్తిడి కొనసాగుతుండటంతో అంబానీ సంపదలో తగ్గుదల నమోదైనట్లు మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




# ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు శుభవార్త త్వరలో ఖాతాల్లో వడ్డీ జమ

**న్యూఢిల్లీ, జూన్ 7 :**

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులకు త్వరలో శుభవార్త అందనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలపై 8.25 శాతం వడ్డీ జమ చేసే ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం లభించిన వెంటనే సభ్యుల ఖాతాల్లో వడ్డీ మొత్తాలు జమ చేయనున్నారు.ఈ ఏడాది మార్చిలోనే ఈపీఎఫ్‌వో కేంద్ర బోర్డు 8.25 శాతం వడ్డీ రేటును ఖరారు చేసింది. అయితే అధికారిక అనుమతులు పూర్తికాకపోవడంతో ఇప్పటివరకు ఖాతాల్లో వడ్డీ జమ కాలేదు. దీంతో కోట్లాది మంది ఖాతాదారులు తమ ఖాతాల్లో వడ్డీ ఎప్పుడు జమ అవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా వడ్డీ రేటు ప్రకటించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమోదం ఇవ్వడం, ఖాతాలను నవీకరించడం వంటి ప్రక్రియలకు కొంత సమయం పడుతుంది. అందుకే ప్రతి ఏడాది వడ్డీ జమలో స్వల్ప జాప్యం కనిపిస్తుంటుంది.వడ్డీ జమ ఆలస్యమవుతే తమకు నష్టం జరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. అయితే అది నిజం కాదు. ఈపీఎఫ్ నిబంధనల ప్రకారం సభ్యుల ఖాతాల్లో నెలవారీ నిల్వల ఆధారంగా వడ్డీని లెక్కిస్తారు. వడ్డీ క్రెడిట్ ఎంట్రీ ఆలస్యంగా కనిపించినప్పటికీ సభ్యులకు రావాల్సిన మొత్తం వడ్డీ పూర్తిగా లభిస్తుంది. పరిపాలనా కారణాల వల్ల జరిగే ఆలస్యం వడ్డీ మొత్తంపై ఎలాంటి ప్రభావం చూపదు.ఖాతాదారులు తమ వడ్డీ జమ అయిందో లేదో యూఏఎన్ పోర్టల్‌లో లాగిన్ అయి పాస్‌బుక్‌ను పరిశీలించడం ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే ఉమాంగ్ యాప్ ద్వారా కూడా వివరాలు చూడొచ్చు. నమోదు చేసిన మొబైల్ నంబర్ నుంచి 7738299899 నంబర్‌కు "యు ఎ ఎన్ ఈపీఎఫ్‌వో హెచ్ ఓ ఇ ఎన్ జి" అని ఎస్ఎంఎస్ పంపి కూడా పీఎఫ్ వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. అయితే ఈ సేవలను వినియోగించుకోవాలంటే యూఏఎన్ నంబర్ యాక్టివ్‌గా ఉండటంతో పాటు ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలు ఈపీఎఫ్ ఖాతాతో అనుసంధానమై ఉండాలి.



# భారత్‌కు రానున్న హోండా కొత్త అడ్వెంచర్ స్కూటర్

**న్యూఢిల్లీ, జూన్ 7 ::**


స్కూటర్ ప్రియులకు హోండా త్వరలో శుభవార్త అందించనుంది. కుటుంబ వినియోగదారుల్లో మంచి ఆదరణ పొందిన యాక్టీవా తర్వాత, సాహసయాత్రలను ఇష్టపడే యువతను లక్ష్యంగా చేసుకుని కొత్త అడ్వెంచర్ శైలి స్కూటర్‌ను భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు సంస్థ సన్నాహాలు చేస్తోంది. హోండా అడ్వెంచర్-160 పేరుతో రానున్న ఈ మోడల్ ఇప్పటికే పలు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి గుర్తింపు పొందింది.నివేదికల ప్రకారం ఈ ప్రీమియం స్కూటర్‌ను దేశీయంగానే తయారు చేసే అవకాశాలను సంస్థ పరిశీలిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఈ వాహనం భారత మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆటో మొబైల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ స్కూటర్ ప్రత్యేక అడ్వెంచర్ రూపకల్పనతో ఆకట్టుకోనుంది. ఎత్తైన గాలి నిరోధక అద్దం, సౌకర్యవంతమైన సీటు, నిటారుగా కూర్చునే రైడింగ్ స్థానం, బలమైన బాడీ నిర్మాణం, ఆకర్షణీయమైన ముందు భాగం వంటి అంశాలు దీనికి ప్రత్యేకతను తీసుకురానున్నాయి. అలాగే 165 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, ముందు 14 అంగుళాల చక్రం, వెనుక 13 అంగుళాల చక్రం, ట్యూబ్‌లెస్ టైర్లు ఇందులో ఉండనున్నాయి.సాంకేతికంగా కూడా ఈ స్కూటర్ ఆధునిక ఫీచర్లతో రానుంది. 156.9 సీసీ ద్రవ శీతలీకరణ కలిగిన ఏక సిలిండర్ ఇంజిన్ 15.8 హార్స్‌పవర్ శక్తిని, 14.7 న్యూటన్ మీటర్ల టార్క్‌ను ఉత్పత్తి చేయగలదు. స్వయంచాలక గేర్ వ్యవస్థ, ఇంధన పొదుపు సాంకేతికత, నిశ్శబ్ద స్టార్టింగ్ వ్యవస్థ వంటి సదుపాయాలు కూడా ఇందులో అందుబాటులో ఉండనున్నాయి.




# మారుతి కార్లపై భారీ తగ్గింపులు

**న్యూఢిల్లీ, జూన్ 7 :**

కారు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు మారుతి సుజుకి శుభవార్త అందించింది. జూన్ నెలలో నెక్సా షోరూమ్‌ల ద్వారా విక్రయించే పలు ప్రీమియం మోడళ్లపై ఆకర్షణీయమైన తగ్గింపులు ప్రకటించింది. పండుగ సీజన్ కాకపోయినా కంపెనీ అందిస్తున్న ఈ ప్రత్యేక ఆఫర్లు కొత్త కారు కొనుగోలుదారులకు మంచి అవకాశంగా మారాయి.ఈ నెలలో అత్యధిక తగ్గింపు ఇన్విక్టో బహుళ ప్రయోజన వాహనంపై లభిస్తోంది. ఈ మోడల్‌పై మొత్తం రూ.2.15 లక్షల వరకు ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. అలాగే గ్రాండ్ విటారా క్రీడా వినియోగ వాహనంపై రూ.1.85 లక్షల వరకు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్న బాలెనో కారుపై రూ.40 వేల వరకు, ఫ్రాంక్స్ మోడల్‌పై రూ.25 వేల వరకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. ఇతర మోడళ్ల విషయంలో కూడా కంపెనీ ఆకర్షణీయమైన వెసులుబాట్లు కల్పిస్తోంది. ఎక్స్‌ఎల్ సిక్స్ వాహనంపై రూ.45 వేల వరకు, జిమ్నీపై రూ.45 వేల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. అలాగే ఇగ్నిస్ స్వయంచాలక గేర్‌బాక్స్ వేరియంట్ కొనుగోలు చేసే వినియోగదారులు కూడా రూ.45 వేల వరకు తగ్గింపును పొందవచ్చు.ఈ ప్రత్యేక ఆఫర్లు జూన్ నెలాఖరు వరకు మాత్రమే అమల్లో ఉంటాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. నగదు తగ్గింపులు, మార్పిడి బోనస్, సంస్థల ప్రత్యేక రాయితీలు వంటి ప్రయోజనాలు ఇందులో భాగంగా ఉండవచ్చని పేర్కొన్నాయి. అయితే ప్రాంతాన్ని బట్టి, డీలర్‌ను బట్టి ఆఫర్లలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వారు సమీప నెక్సా షోరూమ్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని కంపెనీ సూచించింది.




# ‘పెద్ది’ బాక్సాఫీస్ దుమ్మురేపుతోంది

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’బాక్సాఫీస్ వద్ద సంచలన ప్రదర్శన కొనసాగిస్తోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు నెల కొల్పింది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి భారీ స్పందన రావడంతో సినిమా కలెక్షన్లు ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.నిర్మాణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం తొలి రోజు ఈ చిత్రం రూ.135.36 కోట్ల భారీ వసూళ్లతో అద్భుతమైన ఆరంభాన్ని నమోదు చేసింది. రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు వసూలు చేసి మొత్తం మూడు రోజుల్లో రూ.236.7 కోట్ల గ్రాస్ మార్కును దాటింది. దేశీయ మార్కెట్‌తో పాటు విదేశీ మార్కెట్లలో కూడా చిత్రానికి విశేష ఆదరణ లభిస్తోంది.ఉత్తర అమెరికా మార్కెట్‌లో రామ్ చరణ్ మరోసారి తన బాక్సాఫీస్ సత్తా చాటుకున్నారు. అక్కడ ఇప్పటికే ఈ చిత్రం 22 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించి విజయవంతంగాప్రదర్శితమవుతోంది.



## గాయం వల్ల మంచానికే పరిమితం రకుల్ భావోద్వేగం

ముంబై, జూన్ 7 :

ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా వెల్లడించారు. జిమ్‌లో వ్యాయామం చేసే సమయంలో జరిగిన చిన్న పొరపాటు తన జీవితాన్ని కొంతకాలం పూర్తిగా మార్చేసిందని ఆమె తెలిపారు.ఇటీవల ఓ ప్రముఖ చర్చా కార్యక్రమంలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆ అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. జిమ్‌లో సరైన భద్రతా జాగ్రత్తలు తీసుకోకుండా 80 కిలోల బరువుతో డెడ్‌లిఫ్ట్ చేయడానికి ప్రయత్నించానని, దాని ఫలితంగా తీవ్ర వెన్నెముక గాయం ఎదురైందని చెప్పారు.ఆ ప్రమాదం కారణంగా తనకు స్లిప్ డిస్క్ సమస్య తలెత్తిందని, దాదాపు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని వెల్లడించారు. గాయం తీవ్రత వల్ల సాధారణంగా నడవడం, కదలడం కూడా కష్టంగా మారిందని పేర్కొన్నారు.డెడ్‌లిఫ్ట్ వంటి వ్యాయామాలు సరైన పద్ధతిలో, నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే చేయాలని సూచించిన రకుల్, అలాంటి వ్యాయామాలను నిర్లక్ష్యంగా చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. తన విషయంలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తాయని చెప్పారు.ఎప్పుడూ చురుకుగా ఉండే తాను అకస్మాత్తుగా ఇతరుల సహాయంపై ఆధారపడాల్సి రావడం మానసికంగా తీవ్రంగా బాధించిందని రకుల్ తెలిపారు.



## షూటింగ్‌లో వేధింపులు ఎదుర్కొన్నా నటి ప్రియా బాపట్ ఆవేదన

ముంబై, జూన్ 7 :

బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ప్రియా బాపట్ కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని తాజాగా వెల్లడించారు. తన తొలి సిని మా చిత్రీకరణ సమయంలో ఓ సహనటుడు తన అనుమతి లేకుండానే అసౌకర్యానికి గురిచేసే విధంగా ప్రవర్తించాడని ఆమె తెలిపారు.ఒక పాట చిత్రీకరణ సందర్భంగా ముద్దు సన్నివేశంపై తాను ముందుగానే అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, షూటింగ్ సమయంలో ఆ నటుడు కథలో లేని విధంగా ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఇంప్రూవైజేషన్ పేరుతో పదేపదే హద్దులు దాటడంతో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని చెప్పారు.ఆ సమయంలో ఎలా స్పందించాలో, తన అభ్యంతరాన్ని ఎలా వ్యక్తం చేయాలో అర్థంకాక చాలా నిస్సహాయంగా భావించానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిత్రీకరణ సమయంలో ఏర్పడిన ఆ పరిస్థితి తనపై తీవ్ర మానసిక ఒత్తిడిని కలిగించిందన్నారు.అంతేకాకుండా, తాము ఒకే హోటల్‌లో బస చేస్తున్న సమయంలో కూడా ఆ సహనటుడు పదేపదే బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రావాలని ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. తాను పలు మార్లు నిరాకరించినప్పటికీ అతని ప్రవర్తన కొనసాగిందని చెప్పా రు.ఈ పరిణామాలతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్తకు ఫోన్ చేసి బాధను పంచుకునేదాన్నని వెల్లడించారు.

## ‘పెద్ది’పై వరుణ్ తేజ్ ప్రశంసలు చరణ్ నటనకు ఫిదా!

హైదరాబాద్, జూన్ 7 :

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ‘పెద్ది’ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఈ సినిమాపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సినిమా చూసిన అనంతరం సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆయన చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు.ప్రతి సినిమా ప్రేక్షకుల హృదయాలను తాకదని, కానీ ‘పెద్ది’ మాత్రం తనను భావోద్వేగపరంగా బలంగా కదిలించిందని వరుణ్ తేజ్ పేర్కొన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎంతగా కిందపడిపోయినా మళ్లీ లేచి నిలబడాలనే సందేశాన్ని ఈ చిత్రం ఎంతో బలంగా చెబుతుందని అన్నారు. అదే ఈ చిత్రానికి అసలు బలమని, తనను అత్యంతగా ఆకట్టుకున్న అంశమని వెల్లడించారు.దర్శకుడు బుచ్చిబాబు సానా కథను ఎంతో నమ్మకంతో, అంకితభావంతో తెరకెక్కించారని కొనియాడిన వరుణ్ తేజ్.. సినిమాలో నటించిన ప్రతి కళాకారుడు తన పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేశారని ప్రశంసించారు. ముఖ్యంగా సీనియర్ నటుడు జగపతిబాబు, కన్నడ నటుడు శివరాజ్ కుమార్ నటన సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు.




## త్రిష మెడలో లాకెట్‌పై చర్చ పెళ్లి వార్తలకు ఊతమా?

హైదరాబాద్, జూన్ 7 :

దక్షిణాది సినీ నటి త్రిష కృష్ణన్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఆమె ధరించిన ఓ లాకెట్ కారణంగా పెళ్లి గురించి కొత్త ఊహాగానాలు తెరపైకి వచ్చాయి.సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఓ చిత్రంలో త్రిష మెడలో కనిపించిన పెండెంట్‌ను కొందరు నెటిజన్లు కేరళ క్రైస్తవ సంప్రదాయంలో వివాహిత మహిళలు ధరించే ‘మిన్ను’గా పేర్కొంటున్నారు. దీంతో త్రిష రహస్యంగా వివాహం చేసుకున్నారా అనే సందేహాలను వ్యక్తం చేస్తూ పలువురు వ్యాఖ్యలు చేస్తున్నారు. “పెళ్లికూతురు కనిపిస్తోంది.. మరి పెళ్లికొడుకు ఎక్కడ?” అంటూ కొందరు అభిమానులు సరదాగా స్పందిస్తుండగా, మరికొందరు మాత్రం ఇది కేవలం ఆభరణం డిజైన్ మాత్రమే కావచ్చని అభిప్రాయపడుతున్నారు. ఇంకొందరు ఏదైనా సినిమా చిత్రీకరణ లేదా ఫొటోషూట్‌కు సంబంధించిన ప్రత్యేక లుక్ అయి ఉండొచ్చని చెబుతున్నారు. గతంలో కూడా త్రిష వివాహంపై పలుమార్లు పుకార్లు వచ్చినప్పటికీ, వాటిలో చాలా వరకు నిజం కాదని తేలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైరల్ అవుతున్న లాకెట్ ఫొటోపై కూడా అధికారిక స్పష్టత కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు.అయితే ఇప్పటివరకు త్రిష లేదా ఆమె బృందం ఈ అంశంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.







## వడ్డే నవీన్ సినిమాలో సుమ నటించిందా?

హైదరాబాద్, జూన్ 7 :

తెలుగు సినీ ప్రేక్షకులకు ఒకప్పుడు ప్రేమకథలు, కుటుంబ కథా చిత్రాలతో దగ్గరైన హీరో వడ్డే నవీన్ దాదాపు పన్నెండేళ్ల విరామం తర్వాత మళ్లీ వెండితెరపైకి రాబోతున్నారు. ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’ చిత్రంతో రీ–ఎంట్రీ ఇస్తున్న ఆయన ప్రస్తుతం సినిమా ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. జూన్ 19న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటూ తన సినీ జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు.ఇటీవల ప్రముఖ యాంకర్ సుమ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న వడ్డే నవీన్, తన కెరీర్‌లోని పలు మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ తాను కూడా ఒకప్పుడు వడ్డే నవీన్ సినిమాలో నటించిన విషయాన్ని వెల్లడించారు. “మీరు హీరోగా నటించిన ‘చాలా బాగుంది’ సినిమాలో నేను కనిపించాను. 1999లో జరిగిన షూటింగ్‌లో పెళ్లి చూపుల సన్నివేశంలో పెళ్లికూతురి పాత్ర పోషించాను. ఆ సమయంలో నేను గర్భవతిని కూడా. ఆ చిత్రానికి ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వం వహించారు. 2001లో విడుదలైన ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది” అని సుమ గుర్తు చేశారు.సుమ చెప్పిన విషయాలను వడ్డే నవీన్ కూడా గుర్తు చేసుకుంటూ ఆనాటి అనుభవాలను పంచుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత ఆ సంఘటనలను తిరిగి గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అప్పటి షూటింగ్ వాతావరణం, చిత్రబృందంతో గడిపిన క్షణాలు ఇప్పటికీ మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయని అన్నారు.వడ్డే నవీన్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ‘చాలా బాగుంది’ చిత్రం ఆ కాలంలో కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.




## చిరు సినిమాలో హీరోయిన్ మార్పు రచితా రామ్ ఎంట్రీ!

హైదరాబాద్, జూన్ 7 :

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, మాస్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘మెగా 158’ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రంలో కీలక పాత్ర కోసం తొలుత మలయాళ నటి హనీ రోజ్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే తేదీల సర్దుబాటు సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పటికే తీసుకున్న అడ్వాన్స్‌ను కూడా తిరిగి ఇచ్చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.హనీ రోజ్ స్థానంలో ఇప్పుడు కన్నడ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటి రచితా రామ్‌ను చిత్ర బృందం ఎంపిక చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ‘సూపర్ మచ్చి’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన రచితా రామ్‌కు ఇది తెలుగులో రెండో చిత్రం కానుంది. ఇటీవల విడుదలైన ‘కూలీ’ చిత్రంతో ఆమెకు మరింత గుర్తింపు లభించగా, ఇప్పుడు చిరంజీవి చిత్రంలో అవకాశం దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారనుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘వాల్తేరు వీరయ్య’ వంటి ఘన విజయానంతరం చిరంజీవి––బాబీ కొల్లి కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో చిరంజీవి కుమార్తె పాత్రలో మలయాళ యువ నటి అనస్వర రాజన్ నటిస్తున్నట్లు తెలుస్తోంది. సంగీత బాధ్యతలను ఎస్. థమన్ నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం తమిళనాడులోని పొల్లాచ్చి పరిసర ప్రాంతాల్లో ఈ చిత్ర షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. యాక్షన్, భావోద్వేగాలు, కుటుంబ నేపథ్య అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం చిరంజీవి అభిమానులకు మరో ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.





# వైభవ్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం

**సూర్యవంశీతో పాటు ఇంగ్లాండ్, ఐర్లాండ్ టూర్‌కు తల్లిదండ్రులు!**

**సీనియర్లతో సులభంగా కలిసిపోయేందుకే ఈ అవకాశం**

**'సాధారణంగా ఎవరికీ అనుమతి ఉండదు' అన్న: బీసీసీఐ**

ముంబై, జూన్ 07: భారత క్రికెట్ నయా సంచలనం, 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కుటుంబానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి ఒక అరుదైన రిక్వెస్ట్ అందింది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వైభవ్‌తో పాటు అతడి తల్లిదండ్రులను కూడా తోడుగా రావాల్సిందిగా బీసీసీఐ కోరింది. జాతీయ జట్టులోకి అతడికి సెలక్టర్లు చోటు కల్పించిన వెంటనే, బోర్డు యాజమాన్యం ఈ సానుకూల నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

### తల్లిదండ్రులే బలమైన మద్దతు..

ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ కథనం ప్రకారం.. వైభవ్ సూర్యవంశీ కెరీర్‌కు అతడి తల్లిదండ్రులే అత్యంత బలమైన మద్దతుదారులుగా నిలిచారు. వైభవ్ వయసు కేవలం 15 ఏళ్లే కావడంతో, అంతా సీనియర్ ఆటగాళ్లతో కూడిన జాతీయ జట్టు వాతావరణంలో అతడు ఇబ్బంది పడకుండా ఉండేందుకే బీసీసీఐ ఈ ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఈ విషయమై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ కీలక వివరాలు వెల్లడించారు. "సూర్యవంశీ తండ్రి రేపు శ్రీలంకకు వెళ్లనున్నారు. అతడి తల్లిదండ్రులు గనుక ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనకు కూడా వెళ్లాలనుకొంటే వారికి అవసరమైన అన్ని రకాల తగిన ఏర్పాట్లను బీసీసీఐ చేస్తుంది. వైభవ్‌కు వారే అత్యుత్తమ మద్దతుదారులు. సాధారణంగా అంతర్జాతీయ పర్యటనల్లో ఆటగాళ్లతో పాటు వారి తల్లిదండ్రులను మేము అనుమతించము. కానీ, వైభవ్ ప్రస్తుతం ఇండియా-ఎ జట్టులో ఆడుతున్నాడు, అతడు ఇంకా చాలా చిన్నవాడు. అంతా పెద్దలున్న జాతీయ జట్టుతో పాటు ప్రయాణించే వేళ అతడితో పాటు కుటుంబ సభ్యులు ఉండటం సరైన నిర్ణయమని మేము భావిస్తున్నాం."

### సౌకర్యవంతంగా ఉండేందుకే ఈ సాయం

జట్టులోని సీనియర్ ఆటగాళ్లతో వైభవ్ సూర్యవంశీ సులభంగా కలిసిపోయేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని బీసీసీఐ భావిస్తోంది. బోర్డు దీనికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ ప్రయాణ ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనను ఇప్పటికే వైభవ్ తల్లిదండ్రులకు బీసీసీఐ అందించింది. వారు సానుకూలంగా ఉండి వెళ్లాలనుకుంటే బోర్డు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తుంది. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే టీమిండియాకు ఆడుతుండటంతో, కొత్త వాతావరణానికి అలవాటుపడి, అతడు మానసికంగా సౌకర్యవంతంగా ఉండటానికి కొంత సమయం పడుతుందనే ఉద్దేశంతోనే బోర్డు ఈ అండగా నిలుస్తోంది. మైదానం లోపలే కాకుండా మైదానం వెలుపల కూడా ఈ యువ సంచలనానికి బీసీసీఐ అందిస్తున్న ఈ అసాధారణ మద్దతుపై క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# పట్టుబిగించిన భారత్

**భారత్ ధాటికి అఫ్గాన్ బ్యాటర్ల విలవిల!**

**రెండో రోజు ఆట ముగిసేసరికి అఫ్గనిస్థాన్ స్కోర్ 113/5**

**ఇంకా 451 పరుగులు ఆధిక్యంలో టిమిడియా**

**భారత్ తొలి ఇన్నింగ్స్ 564/8 డిక్లేర్**

**గిల్ (126), పంత్ (81), సుందర్ (52) అద్భుత బ్యాటింగ్**



ముల్లాన్‌పూర్, జూన్ 07: అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌పై భారత్ పూర్తి పట్టు సాధించింది. ముల్లాన్‌పూర్ వేదికగా సాగుతున్న ఈ పోరులో తొలి రోజు పరుగుల వరద పారించిన టీమిండియా, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించి కొండంత స్కోరును బోర్డుపై నిలిపింది. 368/3 అనే ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, తన మొదటి ఇన్నింగ్స్‌ను 146 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తమ మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్గానిస్థాన్ బ్యాటర్లు.. భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక చేతులెత్తేశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి అఫ్గాన్ జట్టు 5 వికెట్లు కోల్పోయి కేవలం 113 పరుగులు మాత్రమే చేసి తీవ్ర పరాజయ భారంలో పడింది.

### సెంచరీ దాటిన గిల్.. రాణించిన పంత్, సుందర్

రెండో రోజు ఆటలో భారత ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ తమ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. నిన్న 103 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కెప్టెన్ గిల్, ఈరోజు వ్యక్తిగత స్కోరు 126 పరుగుల వద్ద అవుటయ్యాడు. నిన్న అర్ధశతకం (50టి) చేసిన రిషభ్ పంత్ మరింత వేగంగా ఆడి 81 పరుగులకు వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన లోయర్ ఆర్డర్ బ్యాటర్లలో వాషింగ్టన్ సుందర్ బాధ్యతాయుతమైన ఆటతీరుతో ఆకట్టుకుని 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మిగిలిన వారిలో ధ్రువ్ జురెల్ (19), మానవ్ సుతార్ (28), మహ్మద్ సిరాజ్ (22), కుల్దీప్ యాదవ్ (9) పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ సలీమ్ సఫీ అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా.. రెహమాన్ షరీఫీ, హస్మతుల్లా షాహిది తలో వికెట్ పడగొట్టారు.

### భారత బౌలింగ్ దాటికి అఫ్గాన్ కుదేల్!

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్థాన్ బ్యాటర్లకు భారత పేసర్లు, స్పిన్నర్లు ఆది నుంచే చుక్కలు చూపించారు. భారత లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను ఎదుర్కోలేక పర్యాటక జట్టు క్రమంగా వికెట్లు కోల్పోయింది. అఫ్గాన్ ఇన్నింగ్స్‌లో వన్‌డౌన్ బ్యాటర్ రహమత్ షా ఒక్కడే భారత బౌలర్లను కాస్త ప్రతిఘటించి 43పరుగులతో క్రీజులో నిలిచాడు. ప్రస్తుతానికి ఆ జట్టులో అతడే టాప్ స్కోరర్. ఓపెనర్లు అబ్దుల్ మాలిక్ (16), సెదిఖుల్లా అటల్ (17) ఎక్కువ సేపు నిలవలేకపోయారు. స్టార్ వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ (12), కెప్టెన్ హస్మతుల్లా షాహిది (20), అఫ్సర్ జజాయ్ (3) వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు పడగొట్టి అఫ్గాన్ నడ్డి విరిచారు. ప్రస్తుతం అఫ్గానిస్థాన్ ఇంకా 451 పరుగులు వెనకంజలో ఉంది. చేతిలో కేవలం 5 వికెట్లు మాత్రమే ఉండటంతో, భారత్ మూడో రోజే ఈ మ్యాచ్‌ను ఇన్నింగ్స్ తేడాతో ముగించాలని పట్టుదలగా ఉంది.

# టీజీ టీ20 మెగా వేలం

## టీజీ-20 వేలంలో తిలక్ వర్మకు జాక్‌పాట్



**రూ.33 లక్షలకు సొంతం చేసుకున్న మెదక్ ఫాల్కన్స్**




**రూ.17 లక్షలకు చామ మిలింద్ ను దక్కించుకున్న ఖమ్మం ఏసెస్**

**రూ.14 లక్షలకు పేసర్ మహ్మద్ సిరాజ్ వరంగల్ వారియర్స్ కు**

**రామోజీ ఫిల్మ్ సిటీలో హెచ్‌సీఏ మెగా వేలం.. పాల్గొన్న 8 ఫ్రాంచైజీలు**

**జూన్ 21 నుంచి ఉప్పల్ స్టేడియం వేదికగా లీగ్ ప్రారంభం**

తెలంగాణలోని యువ క్రికెటర్ల ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా ఆరంభించిన 'తెలంగాణ ప్రీమియర్ లీగ్ మెగా వేలం అట్టహాసంగా జరిగింది. రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరిగిన ఈ వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి ఎనిమిది ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీపడ్డాయి. ప్రముఖ వ్యాఖ్యాత చారు శర్మ ఈ వేలాన్ని నిర్వహించారు. తొలి సీజన్ కోసం 1,300 మందికి పైగా ప్లేయర్లు రిజిస్టర్ చేసుకోగా, హెచ్‌సీఏ కేవలం 160 మందిని మాత్రమే వేలం కోసం షార్ట్‌లిస్ట్ చేసింది.

హైదరాబాద్, జూన్ 07: ఈ వేలంలో టీమిండియా స్టార్ క్రికెటర్, హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మకు జాక్‌పాట్ తగిలింది. రూ.5 లక్షల బేస్ ప్రైజ్‌తో వేలంలోకి వచ్చిన అతడి కోసం మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్, నల్గొండ నైట్స్ హోరాహోరీగా పోటీపడ్డాయి. చివరకు మెదక్ ఫాల్కన్స్ రికార్డు స్థాయిలో రూ.33 లక్షలకు తిలక్ వర్మను దక్కించుకుంది. అలాగే, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడు చామ మిలింద్ కూడా భారీ ధర పలికాడు. బేస్ ప్రైజ్ రూ. 5 లక్షలు ఉన్న అతడిని అన్విత ఖమ్మం ఏసెస్ ఫ్రాంచైజీ రూ.17 లక్షలకు కొనుగోలు చేసింది. మరోవైపు టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను రూ.14 లక్షలకు వరంగల్ వారియర్స్ సొంతం చేసుకుంది.

### ఎ-ప్లస్, ఐకాన్ ప్లేయర్ల హవా

ఎ-ప్లస్, ఐకాన్ ప్లేయర్ల కేటగిరీలోనూ ఆటగాళ్లకు వేలంలో మంచి ధర దక్కింది. ఈ జాబితాలో అమన్ రావు పేరాలను రూ.12 లక్షలకు వరంగల్ వారియర్స్ దక్కించుకోగా, ప్రగ్యాన్ రెడ్డిని రూ.11 లక్షలకు పాలమూరు స్ట్రైకర్స్ సొంతం చేసుకుంది. అలాగే, ఆల్ రౌండర్ అజయేవ్ గౌడ్‌ను రూ.11 లక్షలకు హైదరాబాద్ ఛాంపియన్స్, నితిన్ సాయి యాదవ్‌ను రూ.9 లక్షలకు రంగారెడ్డి రైజర్స్ కొనుగోలు చేశాయి. ఐకాన్ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్‌ను రూ.8 లక్షలకు కరీంనగర్ డైమండ్స్ దక్కించుకోగా, బ్యాటర్ రాహుల్ బుద్ధిని రూ.8 లక్షలకు నల్గొండ నైట్స్ తీసుకుంది. ఆరోన్ జార్జ్‌ను రూ.7.5 లక్షలకు రంగారెడ్డి రైజర్స్, రాహుల్ రాయుడును రూ.6.5 లక్షలకు పాలమూరు స్ట్రైకర్స్, చింతల రక్షణ్ రెడ్డిని రూ.6 లక్షలకు నల్గొండ నైట్స్ కొనుగోలు చేశాయి. ఇక రవికిరణ్‌ను కూడా పాలమూరు స్ట్రైకర్స్ జట్టు సొంతం చేసుకుంది.

### జూన్ 21 నుంచి ఉప్పల్ వేదికగా మ్యాచ్ లు

టీజీ టీ20 లీగ్ ఈ నెల 21 నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. 21 రోజుల పాటు సాగే ఈ మెగా లీగ్‌లో మొత్తం 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లన్నీ ఉప్పల్ స్టేడియం వేదికగానే నిర్వహిస్తారు. అయితే, ఈ టోర్నీ మ్యాచ్‌లన్నింటికీ స్టార్ ప్లేయర్లు తిలక్ వర్మ, సిరాజ్ అందుబాటులో ఉండే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. అదే సమయంలో భారత జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467